తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
22 సెప్టెంబర్ 2026

## పెండింగ్ హియరింగ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

### ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**వనపర్తి సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్‌కు సంబంధించి జారీ చేసిన నోటీసులపై పెండింగ్‌లో ఉన్న హియరింగ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలను పరిశీలించి తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని సూచించారు.

సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి.సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. వనపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో నోటీసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హియరింగ్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.



నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన విచారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విచారణకు హాజరైన ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. వివరాలు సక్రమంగా ఉన్న ఓటర్ల దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.



ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో స్వీకరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాలు, చిరునామా మార్పులకు ఫారం-8 దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ గేటుకు

## అంటించిన లేక పై విచారణ



**తూప్రాన్, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** తూప్రాన్ మున్సిపల్ గేట్‌పై ఏపిటి హెచ్ అలెగ్జాండర్ పేరుతో అంటించిన కర పత్రంపై స్టేషన్ ఆవరణలో ఎర్రని వస్త్రంతో కూడిన కరపత్రం వేసిన సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్సై గంగరాజు తెలిపారు. ఆ లేఖలో పదిమంది విప్లవ వీరులకు ఉరిశిక్ష విధించడాని ఖండించారు. ముఖ్యమంత్రి మేడారం పర్యటనలు ఉండగా మొదటి లేక విడుదల చేశామని ఇప్పుడు రెండో లేక రిలీజ్ చేసినట్లు తెలిపారు. ఉద్యమాన్ని అణిచివేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మరో లేఖను తూప్రాన్ పోలీస్ స్టేషన్లో పడవేశారని దీనిపై పూర్తి దర్యాప్తు సీసీ కెమెరాల ఆధారంగా కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- **లారీని ఢీకొట్టిన కంటైనర్**
- **డ్రైవర్ అక్కడికక్కడే మృతి**

**మానవపాడు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** జాతీయ రహదారిపై సోమవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మానవపాడు మండలం నారాయణపురం స్టేజి సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం గోధుమల లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ నారాయణపురం స్టేజి సమీపంలో అకస్మాత్తుగా బ్రేక్ డౌన్ అయింది. దీంతో లారీ డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి, కిందికి దిగి సమస్యను పరీక్షిస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుండి వేగంగా వచ్చిన ఒక కంటైనర్, ఆగి ఉన్న లారీని అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం తీవ్రతకు లారీ డ్రైవర్ తీవ్ర గాయా




లతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద సమయంలో అక్కడ ఉన్న మరొక వ్యక్తి కాలు విరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు మరియు జాతీయ రహదారి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని తక్షణ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అద్భుత సాహసవీరుడిని బలిగొన్న 'ఎల్' బోర్డు కారు!

### 600 కిలోమీటర్ల సైకిల్ యాత్రలో విషాదం

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** 75 ఏళ్ల వయసులో 600 కిలోమీటర్ల సైకిల్ యాత్రకు బయలుదేరిన ఉస్మానియా విశ్వ విద్యాలయ బంగారు పతక విజేత, రిటైర్డ్ ఇంజనీర్ కోటపాటి రామకోటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మెదక్ మండలం మాచవరం గ్రామానికి చెందిన ఆయనకు సైక్లింగ్‌పై ఎంతో ఆసక్తి ఉండేది. తరచూ సైకిల్‌పై దూర ప్రయాణాలు చేసేవారు.




సైక్లిస్టుల బృందంతో కలిసి యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా సూర్యాపేట సమీపంలోని పిల్లలమర్రి ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని కారు సైకిళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకోటేశ్వరరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 'ఎల్' బోర్డు ఉన్న కారు ఢీకొట్టినట్లు సమాచారం. ఘటనతో సైక్లింగ్ వర్గాల్లో విషాదం నెలకొంది. రామకోటేశ్వరరావు స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థల యజమాని శ్రీనివాస్ చౌదరి చిన్నాన్న కావడంతో మాచవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

- **అక్టోబర్ 4న పోలింగ్.. 24న నామినేషన్ల స్వీకరణ**




**మెదక్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటనలో ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించారు. జిల్లా శాఖకు చెందిన సభ్యుల తుది జాబితాను కూడా ప్రచురించినట్లు తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల స్వీకరణకు మెదక్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని కేంద్రంగా నిర్ణయించారు. సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహించి, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం తుది నామినేషన్ల జాబితాను ప్రచురించి, అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. ఈ ప్రక్రియ కూడా మెదక్ ఆర్డీవో కార్యాలయంలోనే జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

అవసరమైన పక్షంలో అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ కేంద్రం మెదక్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయమే. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన అనంతరం ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నిక నిర్వహిస్తారు.

నిర్వహణ కమిటీ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫీజుగా రూ.10 వేల తిరిగి చెల్లించని రుసుము చెల్లించాల్సి ఉంటుందని రమాదేవి తెలిపారు. నామినేషన్ ఫారాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా లేదా రాతపూర్వక అభ్యర్థన సమర్పించి అధీకృత వ్యక్తి ద్వారా సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పొందవచ్చని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 9346999257ను సంప్రదించాలని సూచించారు. పోలింగ్‌కు హాజరయ్యే సభ్యులు సొసైటీ జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డుతోపాటు ఫొటో గుర్తింపునకు సంబంధించిన మరో ఆధారాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని రమాదేవి తెలిపారు.

## దాన్యం కొనుగోలు చేయాలంటే ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- **రేపటినుండి గ్రామాల వారీగా ప్రత్యేక  కేంపెయిన్స్**
- **సెప్టెంబర్ 22 నుంచి 30 లోపు**
- **ఎఇఓ దగ్గర, మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి**
- **జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి**

సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) సెప్టెంబర్ 21 : ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు, దాన్యం కొనుగోలు కోసం,,సబ్సిడీలు, పీఎం కిసాన్, రుణాలు పొందాలంటే ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి జె. స్వరూపరాణి తెలిపారు. జిల్లాలోని రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా దగ్గరలోని మీ సేవ కేంద్రాలను సంప్రదించి ఫార్మర్ ఐడి నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. సెప్టెంబర్ 22 నుంచి 30 2026 వరకు గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ చేపడతారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు నెంబర్, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలు, ఆధార్‌కు లింక్ అయిన



మొబైల్ నెంబర్ తీసుకెళ్లాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ వచ్చిన వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఫార్మర్ ఐడి ద్వారా రైతుల వివరాలు ఖచ్చితంగా నమోదు అవుతాయని, తద్వారా పారదర్శకత పెరిగి ప్రభుత్వ పథకాలు వేగంగా అందుతాయని ఆమె అన్నారు. ఒకే ఐడి ద్వారా లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని, భవిష్యత్తు పథకాల ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. రైతులు మీ సేవ కేంద్రాల్లో కేవలం రూ.15 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, అలాగే రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

# ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు
- ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్లు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 79 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 20, నారాయణఖేడ్ డివిజన్‌కు 2, జహీరాబాద్ డివిజన్‌కు 2, కలెక్టరేట్‌కు 55 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు.

ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఎంప్లాయిమెంట్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ గ్రిడ్, యూత్ వెల్ఫేర్, కోపరేటివ్, లేబర్, అగ్రికల్చర్, విద్య, వైద్య



ఆరోగ్య శాఖ, డి ఆర్ డి ఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, ట్రైబల్ వెల్ఫేర్, మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈ ఈ పి ఆర్, ఎక్సైజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఆరు దరఖాస్తులు



**కంగ్టి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దయాకర్‌రావు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు రెండు, సీడీపీఓ, సీపీఓ, ఎంపీఓ, ఎంఈఓ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు.

## 18 ఏళ్ల నిరీక్షణకు తెర

- 96 మంది భూ బాధిత రైతులకు ఇంటి స్థలాలు



**కొండాపూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** కొండాపూర్ మండలం తోగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో 18 ఏళ్ల క్రితం భూములు కోల్పోయిన 96 మంది రైతులకు ఎట్టకేలకు ఇంటి స్థలాలు దక్కనున్నాయి. అలియాబాద్‌లో 125 గజాల చొప్పున ప్లాట్లను సోమవారం అధికారులు లాటరీ పద్ధతిలో కేటాయించారు. తహసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు పాల్గొన్నారు. రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కేటాయించిన ప్లాట్ల పట్టా సర్టిఫికెట్లను బుధవారం తూర్పు నిర్మల జయప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు చెప్పారు.

## ప్రజావాణికి ఆరు దరఖాస్తులు



**కంగ్టి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దయాకర్‌రావు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు రెండు, సీడీపీఓ, సీపీఓ, ఎంపీఓ, ఎంఈఓ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు.
ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు.

## మల్దకల్ ప్రజావాణిలో

# అధికారులు డుమ్మా

**మల్దకల్ సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు దాటినా అధికారులు మాత్రం రాకపోవడంతో ప్రజలు ఎదురుచూశారు.

ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన అధికారులు రాకపోవడంతో ప్రజలు వెనక తిరిగారు. సోమవారం ప్రజావాణికి సంబంధించిన అధికారులు సక్రమంగా వచ్చే విధంగా, అధికారులు రానివారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గిరిజన సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలి

- బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన

**కొల్చారం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గిరిజన పారిశ్రామికవేత్తలకు పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్టీ మోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవినాయక్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం నుంచి కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్యాలయం వరకు “సబ్సిడీ ఆఫీస్ ముట్టడి–చలో కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్” కార్యక్రమం నిర్వహించారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** గత ఎనిమిదేళ్లుగా గిరిజన పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలు పెండింగ్‌లో ఉండటంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు రూ.1,700 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసి, వాటి కోసం ఎదురుచూస్తున్న సుమారు 3,000 మంది గిరిజన పారిశ్రామికవేత్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిరసనలో పాల్గొన్న బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నాయకులు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. సబ్సిడీల విడుదలలో జాప్యం



చేయకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు గిరిజనుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు లావుడియా రాములు నాయక్, రాష్ట్ర కోశాధికారి మధుసూదన్, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఫుల్‌సింగ్ నాయక్, జిల్లా నాయకులు రాజు నాయక్, అంజి నాయక్, కొల్చారం, హత్నూర మండలాల ఎస్టీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు జిఎంఆర్ ఫౌండేషన్ బాట

**నిజాంపేట్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** నిజాంపేట్ కేంద్రం మండలంలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మండల కేంద్రంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రపు మచ్చేందర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమయ పాలన, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం, లక్ష్య నిర్దేశం, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసమే లక్ష్యం శిక్షకులు శ్రీహరి గారు విద్యార్థులకు వివిధ అంశాలపై



విలువైన సూచనలు అందించారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనా విధానం, నాయకత్వ లక్షణాలు కూడా విజయానికి ఎంతో ముఖ్యమని వివరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులతో పలు కార్యకలాపాలు నిర్వహిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేశారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసమే విజయానికి బలమైన పునాది” అని నిర్వాహకులు తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులుగా ఎదగాలనే లక్ష్యంతో యువతకు అవసరమైన విద్య, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు జిఎంఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన మార్గదర్శకత్వం అందించడమే జిఎంఆర్ ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.

# కోహిర్ మున్సిపాలిటీలో ముమ్మరంగా ఆసరా పింఛన్ల పరిశీలన

- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అర్హతలపై క్షేత్రస్థాయి విచారణ

**కోహిర్ , సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆసరా పింఛన్ల సమగ్ర వెరిఫికేషన్ కార్యక్రమం సోమవారం ముమ్మరంగా కొనసాగింది. పింఛన్ల అర్హతలు, లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీ సి. శశిధర్, ఎంక్వైరీ ఆఫీసర్ శ్రీ సాయి దిలీప్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. లబ్ధిదారులు అందిస్తున్న వివరాలు, పింఛన్ అర్హతలకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులు విచారణ నిర్వహించారు.

పింఛన్ల విషయంలో అర్హత కలిగిన వారికి ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడడంతో పాటు, ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ వెరిఫికేషన్ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



క్షేత్రస్థాయి పరిశీలనలో లబ్ధిదారుల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, సంబంధిత వివరాలను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెరిఫికేషన్ సందర్భంగా లబ్ధిదారులు తమకు సంబంధించిన అవసరమైన పత్రాలు, వివరాలను అధికారులకు అందించి విచారణ ప్రక్రియకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఈ పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.

## రెండు కాళ్లు లేవు కనుకరించండి సార్

- ట్రై సైకిల్ ఇప్పించండి
- వికలాంగుడు డాకూరు రాజు
- జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పుట్టుకతోనే రెండు కాళ్లు లేక ఇబ్బంది పడుతున్న సంగారెడ్డి జిల్లా డాకురు గ్రామం అందోల్ మండలానికి చెందిన జి.రాజు 25. తండ్రి గోపాల్ సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు దరఖాస్తు ఇచ్చారు. సార్ పుట్టుకతోనే రెండు కాళ్లు లేవు తీవ్రంగా ఇబ్బందిగా ఉందని దయతలసి నాకు బ్యాటరీ లేదా ట్రై సైకిల్ ఇప్పించగలరని కోరారు. మా నాన్న గోపాల్‌కు కొంత కాలం క్రితం ప్రమాదవశాత్తు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలయి నడవలేని స్థితిలో ఉన్నారని నన్ను చూసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని దయచేసి నాకు ట్రై సైకిల్ ఇప్పించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ను వేడుకున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను సూచించారు.

## పీఆర్‌టీయూ-టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా దర్శనాల నారాయణ



**కోహెడ, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పీఆర్‌టీయూ-టీఎస్ సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గంలో కోహెడ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బీసీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు దర్శనాల నారాయణ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆధారాసుపల్లి శశిధర్‌శర్మ ఎన్నికయ్యారు. నారాయణకు జిల్లా అసోసియేట్ అధ్యక్ష పదవి దక్కడంపై పీఆర్‌టీయూ కోహెడ మండల శాఖ అధ్యక్షుడు అన్నాడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశబోయిన ఓదెలు, మండల, రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతుందని మహేందర్‌రెడ్డి అన్నారు.

## బాధితులకు సీఎం సహాయనిధి అండ



**కొండాపూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రశాంత్‌గౌడ్ అన్నారు. కొండాపూర్ మండలం తోగరపల్లి గ్రామానికి చెందిన గుడ్డి సంతోష్ కుమార్తె అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ఆశ్రయించగా, ఆయన స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. సోమవారం మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని వై.ప్రభు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్ ప్రభాకర్, ఉమ్మనోళ్ల ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 53వ సారి రక్తదానం చేసిన ఓంప్రకాష్



**నాగల్‌గిద్ద, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** అత్యవసర సమయంలో రక్తదానం చేసి సామాజిక సేవకుడు ఓంప్రకాష్ ఔదార్యం చాటుకున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ బాలాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి ఓ నెగటివ్ రక్తం అవసరమని తెలుసుకుని, నాగల్‌గిద్ద మండలం ఉట్పల్లి గ్రామానికి చెందిన ఓంప్రకాష్ స్పందించి రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాల నిర్వహణతోపాటు అత్యవసర సమయంలో బాధితులకు సహాయం చేస్తున్నట్లు చెప్పారు. ఆయన సేవలకు డాక్టరేట్, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు లభించాయని తెలిపారు. ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఆయన సేవలను పలువురు అభినందించారు.

# నూతన డీసీసీ అధ్యక్షుడికి జగ్గారెడ్డి సన్మానం

### పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తాం: చంద్రశేఖర్‌రెడ్డి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రామ్‌మందిరం వినాయక మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పార్టీ బలోపేతానికి కృషి: జగ్గారెడ్డి**

**జగ్గారెడ్డి మాట్లాడుతూ..** సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా నిర్మలా జగ్గారెడ్డి ఏడేళ్లకు పైగా పార్టీ కోసం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాల కంటే మరింత విస్తృతంగా చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలో కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఆయనకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు.

**సహకరించిన వారికి కృతజ్ఞతలు: చంద్రశేఖర్‌రెడ్డి**

**చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..** తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

**అధిష్ఠానానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు...**

**ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ..** చంద్రశేఖర్‌రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ప్రొఫెసర్ అండ

- 120 జతల క్రీడా దుస్తుల పంపిణీ



**సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** కంది మండలం మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఐఐటీ ప్రొఫెసర్ శ్రీ రఘునందన్ సొంత నిధులతో రూ.లక్ష విలువైన 120 జతల క్రీడా దుస్తులను అందజేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ శ్రీ మూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు రఘునందన్ చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.నరసింహులు, ఉపాధ్యాయులు తుకారం, రవి కుమార్, హరిసింగ్, సర్పంచ్ మాధురి నర్సింలు, పంచాయతీ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆరూర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం





**సదాశివపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** ఆరూరు గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని గ్రామ సర్పంచ్ నాయికోటి లావణ్య మధు అన్నారు. గ్రామ సర్పంచ్ నాయకోటి లావణ్య మధు భూగర్భ డ్రైనేజీ భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు.

వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడం, దుర్వాసన, దోమల బెడద వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థతో గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడి, ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని పంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాదరి విట్టల్, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ నాయికోటి మధు మణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలి: సర్పంచ్ లక్ష్మణ్ నాయక్



**నాగల్‌గిద్ద, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఎస్గి గ్రామంలో సర్పంచ్ జాదవ్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలువడే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్త, గృహ హానికర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు.సర్పంచ్ జాదవ్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు."పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి కుటుంబం తమ ఇళ్ల వద్దనే చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త సేకరణ వాహనానికి అందించాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఎస్గి గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దగలం"అని అన్నారు.

బహిరంగ ప్రదేశాలు, రహదారులు, మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామ పరిశుభ్రత కోసం ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించి గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనానికి భూమిపూజ

**రామాయంపేట,సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సోమవారం సర్పంచ్ కొత్త ప్రవంతి రాజేందర్ గుప్తా ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. VB-G RAM G (వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, గ్రామీణ్) పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, సమావేశాలకు ఈ భవనం ఉపయోగపడనుంది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారం తో మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సభవత్ బాబు,సెక్రటరీ ధనలక్ష్మి, పీఆర్ ఏఈ సల్మాన్ ఖాన్,వార్డు సభ్యులు,కట్టచంద్రం, ద్యాగాలబాలయ్య, కాట్రియాల్ సిద్దారంలు,ద్యాగాల ఎల్లం, ద్యాగాలరాజెల్లు,గొల్ల శ్రీశైలం, కాట్రియాల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తా!

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** చిన్నశంకరంపేట నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తాం. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని" ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలే ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే రోహిత్ రావు చిన్న శంకరంపేట మండలంలో జరిగిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రజల సమస్యలను పరిష్కరించడం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. చిన్న శంకరంపేట మండల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను" అని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారుస్మార్ట్ రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు కూడా ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. గ్రామీణ



ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, తహశిల్దార్ మాలతి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిస్కిన్ అహ్మద్‌కు జాతీయ అమేజ్ అవార్డు

- **నేడు న్యూఢిల్లీలో ప్రధానం**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** సిద్దిపేటకు చెందిన ప్రముఖ ఉర్దూ సాహిత్య ప్రేరకులు సయ్యద్ మిస్కిన్ అహ్మద్ జాతీయ ఆమేజ్ అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని ఇండియన్ ఇస్లామిక్ కల్చరల్ సెంటర్లో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు ఆయన ఈ పురస్కారాన్ని అందుకుంటారు. ఈ మేరకు అమేజ్ ఫౌండేషన్ డైరెక్టర్ రాఘవేంద్ర ద్వివేది, కన్వీనర్ షాహిద్ అంజుమ్ లు ఆహ్వానంలో ప్రకటించారు. జాతీయస్థాయిలో ఉర్దూ భాష అభివృద్ధికి, సంస్కృతి వికాసానికి మిస్కిన్ అహ్మద్ చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. సిద్దిపేటకు చెందిన మిస్కిన్ అహ్మద్ ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో ఉర్దూ కవి సమ్మేళనాన్ని, ముసాయిరా లను నిర్వహిస్తున్నారు. పాల్గొన్న కవులను సత్కరిస్తున్నారు. అదేవిధంగా ఉర్దూ కవుల రచనలను వెలుగు లోకి తీసుకురావడానికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నారు. సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన మిస్కిన్ అన్నివర్గాలతో కలిసి మెలిసి ఉంటూ ఉర్దూ భాష అభివృద్ధికి విశిష్టమైన కృషి చేస్తున్నారు.

రైతు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కార్యక్రమం

# 22 నుంచి 30 వరకు గ్రామాల్లో నమోదు కేంద్రాలు

- **మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) నమోదుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకుని సంబంధిత గ్రామాల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలకు హాజరై రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్ణయించిన తేదీల్లో అందుబాటులో ఉండి రైతుల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు.

రైతు రిజిస్ట్రేషన్ ద్వారా పంటల కొనుగోళ్లు, ఎరువుల కొనుగోళ్లు, పంట రుణాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ సేవలు, రాయితీలు తదితర ప్రయోజనాలు పొందేందుకు వీలుంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

# యూరియా అవకతవకలపై ఆర్టీఐ దరఖాస్తు



**చేర్యాల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని ఓ ఫర్టిలైజ ర్ షాపులో ఇటీవల జరిగిన యూరియా బస్తాల అవకతవకలకు సంబంధించిన పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం ప్రకారం ఇవ్వాలని కోరుతూ సోమవారం చేర్యాల మండల వ్యవసాయ అధికారి ఎండీ. ఆఫ్రోజ్ కు దరఖాస్తు చేసినట్లు కాంగ్రెస్ నేత, ఆర్టీఐ ప్రతినిధి కొండాపురం మధు, వీరన్నపేట మాజీ సర్పంచ్ వల్లూరు శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ షాపుపై నమోదైన కేసు, సెక్షన్ల వివరాలు, అలాగే షాపు పునఃప్రారంభానికి అధికారులు ఇచ్చిన అనుమతులకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలని తన దరఖాస్తులో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

# భక్తులందరికీ అన్న ప్రసాదం

- **వార్డు కౌన్సిలర్ సౌజన్య దిలీప్ రెడ్డి**



**పెబ్బేరు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో వెలసిన నవరాత్రి వినాయక ఉత్సవాల్లో భాగంగా భక్తులందరికీ అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. సోమవారం వార్డు కౌన్సిలర్ సౌజన్య దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని భక్తులకు అందించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆంజనేయస్వామి ఆలయంలో మట్టి గణనాథుని ఏర్పాటుచేసి ఆరాధించడం ఆనవాయితీ. పార్టీలకతీతంగా భక్తితో అశేష సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. వార్డు అభివృద్ధిలో సమస్యలు పరిష్కరించడంలో తమ వంతు కృషి చేస్తామని కౌన్సిలర్ సౌజన్య దిలీప్ రెడ్డి అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటూ ప్రసాదం స్వీకరించిన దాతలు మనస్పూర్తిగా ఆశీర్వదించారు.

# ప్రజావాణికి 13 దరఖాస్తులు



**రామాయంపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** రామాయంపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 13 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో షాజీలొద్దీన్ తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 4, మున్సిపల్ శాఖకు 3, విద్యుత్ శాఖకు 2, ఎస్సీ కార్పొరేషన్, ఇందిరమ్మ ఇళ్లు, పోలీస్, పంచాయతీరాజ్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజినీ కుమారి, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఆర్ఐ గోపి పాల్గొన్నారు.

# మొక్కలు నాటాలి - నాటిన మొక్కలను సంరక్షించాలి

- **సర్పంచ్ జంగిలి లక్ష్మితిరుపతి**



**బెజ్జంకి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని రేవులపల్లి గ్రామంలో సోమవారం స్వచ్ఛత హే సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ జంగిలి లక్ష్మితిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,ఎంఈఓ మహతి లక్ష్మి,ఉప సర్పంచ్ గైని త్రిశూల్,వార్డు సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంగిలి లక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనం,పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రావుల తిరుపతి, వార్డు సభ్యులు బండ మహేందర్, జంగిలి రజితసంపత్, గొడ్డేటి సరితమల్లేశం, నిశాని మాధురి ప్రశాంత్, శాంబు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కొల్చారం పీఎం శ్రీ కేజీబీవీ బాలికలకు అద్భుత విజయం

- **హైదరాబాదులో జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ లో ప్రతిభ**
- **స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ధరణి**



పోటీలో ప్రతిభ కనబరిచిన కొల్చారం పీఎం శ్రీ కేజీబీవీ బాలికలు

**కొల్చారం, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** హైదరాబాదులోని కాటేదాస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగిన ఓపెన్ నేషనల్ లెవెల్ ఆల్ సైడ్ మార్చల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ లో కొల్చారం పీఎం శ్రీ కేజీబీవీ బాలికలు అద్భుత ప్రతిభను కనబరిచారు.

ఈ పోటీలకు సుమారు 1000 మంది బాలికలు హాజరుకాగా, కొల్చారం పీఎం శ్రీ కేజీబీవీ నుండి 19 మంది బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు. 12 మంది గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్, ఇద్దరూ బ్రాస్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ మల్లేశం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ధరణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# ఏఐఎస్‌ఎఫ్ సిద్దిపేట జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయండి

- **ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్**




**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) సిద్దిపేట జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్ కోరారు. సోమవారం సిద్దిపేట లోని ఎడ్ల గురువారెడ్డి భవన్ లో ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. జిల్లా 5వ మహాసభలను ఈ నెల 24, 25న చేర్యాల పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, విద్యా రంగానికి సంబంధించిన మేధావులు, ప్రజలు ఈ మహాసభలను జయప్రదం చేయాలని

భారతదేశంలో విద్యార్థుల హక్కుల కోసం ఏర్పడిన తొలి విద్యార్థి సంఘంగా ప్రత్యేకమైన చరిత్ర ఉందని తెలిపారు. 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి విద్యార్థుల సమస్యలపై, విద్యా హక్కులపై, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ వస్తోందని పేర్కొన్నారు. జిల్లా 5వ మహాసభల్లో గత ఉద్యమాలపై సమీక్షతో పాటు భవిష్యత్‌లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి, నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్,జిల్లా నాయకులు బత్తుల రంజిత్, బాణోత్ రమేష్,అరవింద్,ఫణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

• అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. అందులో భూభారతి 36, పెన్షన్లు 10, ఇందిరమ్మ ఇల్లు 10, ఇతర 34 మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి పరిష్కారం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్లకు 882 దరఖాస్తులు

• 25 వరకు కొనసాగనున్న పరిశీలన



న్యాల్‌కల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ఇందిరమ్మ చేయూత పెన్షన్ల కోసం న్యాల్‌కల్ మండలంలోని 38 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన 882 దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. మండల ప్రత్యేకాధికారి యాదగిరి ఆధ్వర్యంలో అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సోమవారం ముంగి, హుసేల్లి, హద్నూర్, చాల్కి, రాజోల, రత్నాపూర్ తదితర గ్రామాల్లో పరిశీలన చేపట్టారు. ఈ నెల 18న ప్రారంభమైన ప్రక్రియ 25 వరకు కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్ తెలిపారు. వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారి దరఖాస్తులను అర్హతల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫార్మసీ మెడికల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే



చేర్యాల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): పట్టణంలోని హనుమాన్ టెంపుల్ ఆవరణలో తెలంగాణ ఫార్మసీ మెడికల్ అండ్ సర్జికల్ మందుల షాపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేర్యాల పట్టణం వ్యాపార రంగాలలో ముందుకు వెళుతూ ప్రజలకు మంచి మందులు సరఫరా చేసి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

## స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ కి ఘన నివాళులు...



నారాయణపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): పట్టణంలోని సుభాష్ రోడ్ లోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు బాపూజీ ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆసన సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ కార్యదర్శి కె. తిలక్ బాబు, సభ్యులు పాపయ్య, గద్దం నరసింహులు, నీలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

• పకడ్బందీ దర్యాప్తు.. బలమైన సాక్ష్యాధారాలతో నిందితురాలికి శిక్ష
• పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదుతో పాటు రూపాయలు 6000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరికి బండ గ్రామానికి చెందిన మురళికి, మనోహరాబాద్‌కు చెందిన విజయలక్ష్మితో సుమారు 22 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ విషయాలపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ లో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలోనూ పంచాయితీలు నిర్వహించి ఇరువురికి నచ్చజెప్పారు. మురళికి సుమారు 18 నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగడంతో అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయమై కూడా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2021 మార్చి 15న రాత్రి మురళి మంచంపై నిద్రిస్తున్న సమయంలో విజయలక్ష్మి రోకలిబండతో అతనిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మార్చి 16న అప్పటి మనోహరాబాద్ ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ స్వామిగౌడ్ పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి కేసు విచారణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించారు. కేసు విచారణలో కోర్టు లైజన్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు. నిందితురాలికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేసి, పటిష్టమైన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## 24న రాత్రి గణేష్ శోభాయాత్ర

• 25 సాయంత్రానికల్లా నిమజ్జనం పూర్తి చేయాలి: ఉత్సవ సమితి



నారాయణపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా కేంద్రంలో దశాబ్దాలుగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గణేష్ నవ రాత్రి ఉత్సవాల అనంతరం ఈనెల 24న రాత్రి గణేష్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పట్టణ గణేష్ ఉత్సవ సమితి తెలిపింది. వివిధ మండపాల నిర్వాహకులు సహకరించి శోభాయాత్రను విజయవంతం చేయాలని, హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సమితి కోరింది. ఈనెల 25న సాయంత్రానికల్లా గణేష్ విగ్రహాల నిమజ్జనం పూర్తి చేయాలని సూచించింది. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు భీమ్‌చందర్‌గౌడ్, కార్యదర్శి మిర్చి వెంకటయ్య, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, నగర అధ్యక్షుడు మురళి బట్టడ్, కార్యదర్శి ప్రవీణ్ కదదాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

9వ జాతీయ పోషణ మాసం మండల కన్వర్జెన్సీ సమావేశం



ఉప్పునుంతల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా మండల కన్వర్జెన్సీ సమావేశాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీడీవో వరుణ్‌తేజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిపాషా పావని మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆరోగ్యలక్ష్మి భోజనం, బాలామృతం, బాలామృతం ప్లస్, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల ప్రాధాన్యతను వివరించారు.

తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొడుకుల దాడిలో తండ్రి మృతి

పొలం పంచాయతీ విషయంలో ఇనుప వస్తువులతో దాడి



మక్తల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): పొలం పంచాయతీ విషయంలో కన్న తండ్రిపై ఇద్దరు కొడుకులు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మక్తల్ మండలం తిర్లాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల రాములు (56)కు పొలం తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకునే విషయమై కొడుకులు క్రిష్ణ, వెంకటేష్‌తో కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇద్దరు కొడుకులు తండ్రిని ఇంట్లో తాళం వేసి, ఇనుప పలుగు, ఇతర ఇనుప వస్తువులతో దాడి చేసినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన రాములును బంధువులు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న మక్తల్ ఎస్సై రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పిఆర్‌టియు టీఎస్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక




మద్దూరు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): మద్దూరు మండల పిఆర్‌టియు టిఎస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2026–28 కాలానికి మండల అధ్యక్షుడిగా సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా రాజు నాయక్, గౌరవ అధ్యక్షుడిగా భీమ్లా నాయక్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా నరేష్ గౌడ్, డి.కె. సుభాష్ కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా శారద, ఉపాధ్యక్షులుగా తిరుపతి రెడ్డి, భరత్ కుమార్, మహిళా ఉపాధ్యక్షులుగా సునీత, సంగీత ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా బాల్చందర్, హరికృష్ణ, బస్వంత్, పవన్ కుమార్, మహిళా కార్యదర్శులుగా షహనా, శిరీష, ప్రచార కార్యదర్శులుగా ఇబ్రహీం, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, మద్దూరు ఎంఈఓ జనార్దన్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## ఉద్యమ గాయకుడు సాయిచంద్‌కు ఘన నివాళి



రాజోళి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) : తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన పాటలతో ప్రజల్లో చైతన్యం నింపిన ప్రముఖ జానపద గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ జయంతి వేడుకలు మాన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం సుదర్శనం మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సాయిచంద్ తన ఆట, పాట, మాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారని అన్నారు.

ఆయన జానపద గేయాలు తెలంగాణ ప్రజలను చైతన్యపరిచాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు.

# కోహీర్‌లో ప్రజావాణికి 7 వినతులు

- ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి..
- హాజరైన 19 మంది అధికారులు

**కోహీర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాలు అందజేశారు. ప్రజల నుంచి మొత్తం 7 వినతులు స్వీకరించినట్లు మండల స్థాయి ప్రజావాణి నివేదికలో పేర్కొన్నారు.

**అధికారుల సమక్షంలో వినతుల స్వీకరణ...**

మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 19 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు అందజేసిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల స్వభావాన్ని బట్టి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి కార్యక్రమం వేదికగా నిలుస్తోంది.



**ప్రతి సోమవారం నివేదిక...**

మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన వివరాలతో నివేదికను మండల నోడల్ అధికారి జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలలోపు సంతకం, ముద్రతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఎం. ఉమాదేవి మండల స్థాయి నోడల్ అధికారిగా వ్యవహరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# నిమజ్జనాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి



**అమీన్పూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనాలకు వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలని రామచంద్రపురం ఏసిపి ఉదయ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీరంగూడ శంభుని కుంట వినాయక నిమజ్జన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఎవరు కూడా చెరువులోకి దిగకుండా అక్కడ ఉన్న సిబ్బందికి విగ్రహాలను అప్పగించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న స్థలాల్లో నిమజ్జనాలు చేయకుండా అధికారులు సూచించిన స్థలాల్లోనే నిమజ్జనాలు చేయాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అందరు కూడా అధికారులకు పోలీస్ సిబ్బందికి సహకరించి నిమజ్జనాలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఆయనతో పాటు అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

# గుంతల రోడ్డుకు మట్టితో తాత్కాలిక మరమ్మతులు



**రామాయంపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
రామాయంపేట మండలం కాట్రియాల్-లక్ష్మాపూర్ మధ్య రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతలు మరింత పెద్దవిగా మారడంతో సమస్యను స్థానికులు సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ ట్రాక్టర్లతో మట్టి తరలించి సుమారు రెండు కిలోమీటర్ల మేర గుంతలను పూడ్చించారు. దీంతో వాహనదారులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. అయితే రహదారికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్‌కు వాహనదారులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# జూరాల రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వంపై పోరాటం

## నేడు జూరాల ప్రాజెక్టును సందర్శించనున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
జూరాల ఆయకట్టు పరిధిలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు రేపు జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు తెలిపారు.
జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని నారాయణ ఆరోపించారు. పంటలను కాపాడుకునేందుకు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేసిన రైతులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. రైతులను ప్రాజెక్టు వద్దకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.
ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి జూరాల పర్యటనకు రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డి. నారాయణ పిలుపునిచ్చారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

- కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి
- చేనేత సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు చింత గోపాల్



**సదాశివపేట: సెప్టెంబర్ 21(జనంసాక్షి):**
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

## పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు చంద్రయ్య



**చేర్యాల, సెప్టెంబర్ 21(జనంసాక్షి) :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకమని పద్మశాలి సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ ఆడెపు చంద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు కొక్కుల సురేందర్, దూడం వెంకట్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దళితుల యొక్క భూ సమస్యను పరిష్కరించండి

## కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు కొంతాన్ పల్లి దళితుల మొరా


**శివ్వంపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన దళితులకు అప్పటి ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడీ అండదండలతో రికార్డులను తారుమారు చేశారని చేసి అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు కొంతాన్ పల్లి దళితులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి వారు ఫిర్యాదు చేశారు. గతంలో కొంతాన్ పల్లి శివారులోని సర్వేనెంబర్ 329లో 4 ఎకరాల 16 గుంటల ప్రభుత్వ భూమిని అధికారులు కేటాయించి, పట్టాలు అందజేశారని జిల్లా కలెక్టర్‌కు వారు వివరించారు. దళితుల కిచ్చిన ప్రభుత్వ భూములకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తి పేరిట రెవిన్యూ అధికారుల అండదండలతో గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకుడు రికార్డులు తారుమారు చేయించరని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని సదరు నాయకుడు కొంతాన్ పల్లి



శివారులోని సర్వేనెంబర్ 330, 331, 334, 335, 336, 337, 362, 377, 380, 383, 385, 386, 387లలో అక్రమ ఆర్ఓఆర్లు సృష్టించి తమ అనుచరులు, బంధువుల పేర్ల మీద భూములు నమోదు చేయించినట్లు దళితులు జిల్లా కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా పేర్లు నమోదు చేయించడంతో నిజమైన రైతులకు అన్యాయం జరిగిందని ,పాసు బుక్కులు రాక పార్ట్ బీలో భూములు ఉండిపోయాయని కలెక్టర్ కు వివరించారు. అక్రమాలపై విచారణ జరిపించి కొంతాన్ పల్లి దళితులకు న్యాయం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగం దేవలింగం, శివకుమార్, గుండు శంకర్ తదితరులు ఉన్నారు.

# గణేష్ నిమజ్జన వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్యయాదవ్



**నారాయణపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పట్టణంలో ఎంతో వైభవంగా జరిగే గణేష్ నిమజ్జన వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి అన్నారు. పట్టణంలో గాంధీనగర్ శ్రీ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపంలో స్వామివారికి ఘనంగా పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సందర్భంగా వినాయక ఫ్రెండ్స్ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్యయాదవ్ ను శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జయశ్రీ విజయ్ కుమార్, అయ్యప్ప దీక్ష సేవా సమితి అధ్యక్షులు కాకర్ల భీమయ్య, గాంధీనగర్ చేనేత కార్మికులు, భక్తులు మహిళలు పాల్గొన్నారు

# మా పొలం మాకు ఇప్పించండి

- అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర విచారణ జరపాలి
- తహసీల్దార్‌ను ఆశ్రయించిన రైతు అంకెనపల్లి మల్లయ్య



**మునిపల్లి, సెప్టెంబర్ 21(జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు అంకెనపల్లి మల్లయ్య తనకు వారసత్వంగా రావాల్సిన సర్వే నంబర్ 45/ఈ/2లో 13 గుంటల భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపిస్తూ మండల తహసీల్దార్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
అనంతరం బాధితులు అంకెనపల్లి లక్ష్మయ్య, కుమారుడు మొగులయ్య మాట్లాడుతూ...
తన అన్న లక్ష్మయ్య, ఆయన కుమారుడు నారాయణ తనకు తెలియకుండా భూమిని తమ పేర్లపై నమోదు చేసుకున్నారని ఆరోపించారు.

2016లో జరిగిన భూ పంపకాల సమయంలో అల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 45/ఈ/2లో మొత్తం 33 గుంటల భూమి ఉండగా, అందులో 20 గుంటలు లక్ష్మయ్యకు, మిగిలిన భూమి తన వాటాగా రావాల్సి ఉందన్నారు. అయితే తనకు తెలియకుండా మొత్తం 33 గుంటల భూమిని లక్ష్మయ్య, ఆయన కుమారుడు నారాయణ పేర్లపై నమోదు చేయించుకున్నారని ఆరోపించారు.

ఈ వ్యవహారంపై పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు, సేల్‌డీడ్‌లను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని మల్లయ్య కోరారు. ముఖ్యంగా 28-10-2016న జరిగిన రిజిస్ట్రేషన్‌తో పాటు అనంతరం జరిగిన భూలావాదేవీలను పరిశీలించి, ఆయా సర్వే నంబర్లలో వాస్తవంగా ఎంత విస్తీర్ణం ఉంది, ఎవరి పేరుపై ఎంత భూమి నమోదైందనే విషయాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

పాత రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లు, సేల్‌డీడ్‌లలో చూపించిన విస్తీర్ణానికి మధ్య ఉన్న తేడాలను సరిచేసి తనకు రావాల్సిన భూమిని తనకు ఇప్పించాలని అధికారులను కోరారు.

**బెదిరింపులకు గురిచేస్తున్న సర్పంచ్...**

తన భూమి తమకు ఇవ్వాలని కొల్లాపూర్ సర్పంచ్ నారాయణ యాదవ్ ను సంప్రదించగా భూమి ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని ఆరోపించారు. గతంలో భూమిని తనకు ఇస్తానని చెప్పి కాలయాపన చేశారని, ప్రస్తుతం తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మల్లయ్య తహసిల్దార్ కు కోరారు.

## ప్రజావాణికి 139 దరఖాస్తులు సత్వరమే పరిష్కారం

• జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ



సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలు మూలల నుంచి పలువురు అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో అర్జిలు మొత్తం 139 వచ్చాయని, అర్జీదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

• మండలంలో 115 విగ్రహాల ఏర్పాటు.. 82 విగ్రహాల నిమజ్జనం





న్యాల్‌కల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): న్యాల్‌కల్ మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 38 గ్రామ పంచాయతీల పరిధిలో 115 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వరకు పోలీసుల భద్రత మధ్య 82 విగ్రహాలను మంజీరా నది, నారింజ ప్రాజెక్టు, సమీప నీటి నిల్వ ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. మహిళలు, యువకులు ఆటపాటలతో శోభాయాత్రలు నిర్వహించారు. ఎస్సై సుజిత్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. మిగిలిన విగ్రహాలను ఈ నెల 23న నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలు ముగించుకొని వెళ్తున్న వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు

గండీడ్,సెప్టెంబర్ 21(జనంసాక్షి): గణపతి నిమజ్జనం అనంతరం ఇంటికి వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడిచేసిన ఘటన గండీడ్ మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 20వ తేదీ అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో కోస్గి గణేష్‌కుమార్ ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన బోయమోని హన్మంత్,బోయమోని శ్రీను,అతడిని అడ్డగించి కొట్టినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి,తెలిపారు.

## బస్వాపూర్ గ్రామంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు



బస్వాపూర్, సెప్టెంబర్ 21, (జనంసాక్షి): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, అంబటి శ్రీనివాస్ ,ఈగ శ్రీనివాస్, వేముల నరేష్, కొక్కుల బిక్షపతి, కట్ల బాలమల్లు, కొక్కుల భానుచందర్ ,బూర శ్రీశైలం, వేముల శ్రీపాల్, వేముల చందు, గాదాసు భాస్కర్, బూర శ్రీనివాస్, బూర రమేష్, బూర సురేష్ ,తాటిపాముల తిరుపతి, మాంకాల రమేష్, తాటిపాముల రాజేష్, ఆదిమూల శ్రీహరి, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ పత్రాల తయారీ.. విచారణకు విజ్ఞప్తి

• సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

• జిల్లా అదనపు కలెక్టర్ వినతి

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): భూమికి సంబంధించిన పత్రాల్లో నకిలీ పత్రాల తయారీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎం.శ్రీనివాస్ జిల్లా అదనపు కలెక్టర్ పాండు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి లేఖ సమర్పించారు. గతంలో సమర్పించిన ఫిర్యాదులో వివాదాస్పద పత్రాల నిజమైనతనంపై అనుమానాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఫైల్ నంబర్ 035240/11/06/హెచ్ఎండిఏ/12032021కు సంబంధించిన పత్రాలతో పాటు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నుంచి పొందిన రికార్డులను కూడా సమర్పించినట్లు పేర్కొన్నారు. సంబంధిత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయని తెలిపారు. పత్రాలు నకిలీవని లేదా మోసపూరితంగా ఉపయోగించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై క్రిమినల్, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూభారతి రికార్డుల్లో సంబంధిత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు నమోదై ఉండగా, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో వేరేగా ఉందని, విచారణ జరిపించాలని శ్రీనివాస్ కోరారు. గతంలో





సమర్పించిన ఫిర్యాదుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. ఫిర్యాదుకు గత లేఖ, వివాదాస్పద పత్రం, తహసీల్దార్ కార్యాలయ రికార్డులు, నిషేధిత జాబితా, భూభారతి రికార్డులు, ఆర్డీవో కార్యాలయ కమ్యూనికేషన్ ప్రతులను జత చేసినట్లు తెలిపారు.

## కళ్యాణలక్ష్మి - షాదీముబారక్ చెక్కుల పంపిణీ

• సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మనూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి-షాదీముబారక్ పథకం కింద 11 మంది లబ్ధిదారులకు చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద 15 మందికి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలు, వైద్య చికిత్స వంటి అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు రేషన్ సరుకులతోపాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందుతాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను ఆశ్రయించకుండా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వాలియా నాయక్‌కు అభినందనలు

• సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: బి.కృష్ణ



వనపర్తి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): వనపర్తి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వాలియా నాయక్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవికిరణ్ అభినందించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వాలియా నాయక్‌ను శాలువాతో సత్కరించారు. సర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారానికి సంఘం చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు. పలువురు సర్పంచులు వాలియా నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయ కులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కృష్ణ, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): కృష్ణ మండలం ఆలంపల్లి గ్రామానికి చెందిన కట్ల శరణప్ప (39) సోమవారం రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా పరిషత్ పాఠశాలలో గేమ్స్ కార్యక్రమానికి వెళ్లిన శరణప్పకు కూర గాయలు కోస్తుండగా చిన్న గాయం కావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శరణప్పకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఆయుర్వేద వైద్య శిబిరం





మల్దకల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారము ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సంబరాలు సందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు.మూడు రోజులపాటు క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.యోగ నడక, ఆరోగ్య కరమైన ఆహారం, అలవాట్లు ఆయుర్వేద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయుర్వేద మందులు కావలసిన వారు మూడు రోజుల పాటు జరిగే ఉచిత క్యాంపులో మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషా రాణి,స్టాఫ్ నర్స్ మమత,ఎస్ఎన్ఓ రాము,శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు బాలుడు మృతి



కెటిదొడ్డి, సెప్టెంబర్ 21(జనంసాక్షి): పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ యువకుడిని పిడుగు రూపంలో మృత్యువు కబలించిన హృదయవిదారక సంఘటన కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ?స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం… ప్రమాదవశాత్తు చెట్టుపై బలంగా పిడుగు పడటంతో మల్లేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చేతికి అందివచ్చిన కుమారుడు పిడుగు పాటుకు గురై మృతి చెందడంతో తండ్రి వెంకటేష్, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ దారుణ ఘటనతో యర్సన్‌దొడ్డి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## హామీలు అమలు చేయకుండా ప్రజాపాలన దినోత్సవం ఎలా?

• ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్



కొత్తపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ కోస్గి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో నిరసనలు నిర్వహించారు. హామీలు నెరవేర్చకుండా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం, పంట బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండల కేంద్రంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, వెంకట నరసింహులు, మల్లేష్, సాయిలు, కోనేరు సాయప్ప, వెంకటేష్, శ్రీశైలం, నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ముట్టడికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

- **సాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ ఆందోళన**




**అమరచింత, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనలో పాల్గొనేందుకు జూరాల ప్రాజెక్టు ముట్టడికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూరాల క్యాంపు సమీపంలో ఆయనను అడ్డుకున్న పోలీసులు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు అమరచింత, ఆత్మకూరు మండలాల్లో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ ఉన్నప్పటికీ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టులో ఉన్న నీటిలో రెండు టీఎంసీలు విడుదల చేస్తే దిగువ ఆయకట్టు పంటలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్య తలెత్తుతుందనే ప్రభుత్వ వాదనపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు మాట్లాడుతూ సాగునీటి కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమకు మద్దతుగా వచ్చిన మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అరెస్టులతో రైతుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని పేర్కొన్నారు. సాగునీరు విడుదల చేయకపోతే జూరాల ప్రాజెక్టు వద్ద మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పిలుపు నేపథ్యంలో అమరచింత, ఆత్మకూరు మండలాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మస్తిపురం ఎక్స్‌రోడ్, ప్రాజెక్టు పరిసరాల్లో సీఐ శివకుమార్, ఎస్సై ఎం.స్వాతి, జయన్న ఆధ్వర్యంలో పోలీసు బలగాలను మోహరించారు. సాగునీటి సమస్యను పరిష్కరించి రైతులకు నీరు విడుదల చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

# విజృంభిస్తున్న విషజ్వరాలు, డెంగ్యూ

## అప్రమత్తతే అసలు మంత్రం: వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక





**బిజినేపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** విషజ్వరాలు, డెంగ్యూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రియాంక సూచించారు. సోమవారం గుడ్లనర్వ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన రెండేళ్ల చిన్నారి నితీషాకు డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

డీఎస్ఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఎపిడమాలజిస్ట్ ప్రవళిక తదితరులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో యాంటీ లార్వల్ ఆపరేషన్, పైరెథ్రం స్ప్రేయింగ్ చేపట్టారు. జిల్లాలో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతున్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎస్ఓ సూచించారు. ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలాల్లో చోరీలకు చెక్

- **బోరు మోటార్లు, కేబుల్ వైర్ల అపహరణకు అడ్డుకట్ట**
- **నేపాల్ నిందితుడి అరెస్టు.. మోటారు, 500 మీటర్ల వైర్ స్వాధీనం**



**కల్వకుర్తి, సెప్టెంబరు 21 (జనంసాక్షి):** కల్వకుర్తి, ఊరుకొండమండలాల పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల వద్ద రాత్రివేళ జరుగుతున్న బోరు మోటార్లు,కేబుల్ వైర్ల చోరీలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు.చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న నేపాల్‌కు చెందిన కృష్ణ దామిని పోలీసులు అరెస్టు చేశారు.గత నెల రోజులుగా రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన బోరు మోటార్లు, విద్యుత్ కేబుల్ వైర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఒక బోరు మోటారు, సుమారు 500 మీటర్ల కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన సామగ్రిని తరలిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు పేర్కొన్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బి. భీమ్‌కుమార్,ఎస్సై కురుమూర్తి తెలిపారు. వ్యవసాయ పొలాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు రైతులకు సూచించారు.

# వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు..

- **సిఐ రఘువీర్ రెడ్డి**



**వెల్దండ, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వెల్దండ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీజేల నుంచి వెలువడే అధిక శబ్దం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, హృదయ స్పందనలో మార్పులు చోటుచేసుకునే ప్రమాదం ఉందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలను భజనలు, కోలాట పాటలు, డప్పు వాయిద్యాలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్సైలు యుగేందర్ రెడ్డి, మాధవరెడ్డి, వీరబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాల్వలు శుభ్రం చేయాల్సింది మున్సిపాలిటీనా.. ప్రజలేనా?

- **9వ వార్డులో పారిశుధ్యంపై కాలనీవాసుల ఆవేదన..**
- **శ్రమదానంతో మురుగు కాల్వల శుభ్రత**



**వనపర్తి సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పట్టణంలోని 9వ వార్డు గ్రీన్ రోడ్స్ కాలనీలో మురుగు కాల్వలు సరిగా శుభ్రం చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభి స్పోర్ట్స్ పైభాగంలోని కాలనీలో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్య సమస్య నెలకొన్నట్లు స్థానికులు తెలిపారు.

కాల్వలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులు, సంబంధిత కౌన్సిలర్ మహేశ్వరికి పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో కాలనీవాసులే స్వయంగా రంగంలోకి దిగారు. శ్రమదానం చేసి మురుగు కాల్వలను శుభ్రం చేసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో తామే సమస్యను పరిష్కరించుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాల్వల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పారిశుధ్య సమస్యపై మున్సిపల్ అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని, 9వ వార్డు, నాయకులు కుమార్ భేదడి, కాలనీవాసులు కోరారు.

# చిన్నముద్దునూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

- **మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**





**తెలకపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల పరిధిలోని చిన్నముద్దునూరు గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కర్నె తిరుపతయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండ పర్వతాలు, సర్పంచ్ రుక్సానా ఖదీర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు






**మల్దకల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మల్దకల్ ఆలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు,మాజీ డిసిసి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ సత్యరెడ్డి,మాజీ ఎంపీపీ రాజారెడ్డి,బండ్ల రాజశేఖర్ రెడ్డి,బిజ్వారంశ్రీనివాస్ రెడ్డి, ఐజ మాజీ ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న,సీడ్ ఆర్గనైజర్ శేషంపల్లి నర్సింహులు, ఏల్కూరు చక్రధర్ రెడ్డి, అమరవాయి సర్పంచ్ తూముకృష్ణారెడ్డి,మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొంకతి నరేందర్,మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సవారన్న, కెఆర్ చెరువు సర్పంచ్ భగవంతు,మల్దకల్ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్చం,నోటు పుస్తకాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **20 మంది లబ్ధిదారులకు రూ.7.22 లక్షలు**



**అమరచింత, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** అమరచింత మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి రమేష్, మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం రూ.7,22,500 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవికాంత్, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రవి యాదవ్, తోఫిక్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేట జిల్లాలో
## విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమం




**నారాయణపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** స్థానికజీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ కోసం సామూహిక చర్యలను బలోపేతం చేసేందుకు, జిల్లాస్థాయి అధికారులు, శాఖాధిపతులను ఒకచోట చేర్చి, ఈకో ఫాన్ సొసైటీ సోమవారం నారాయణపేట జిల్లాలో "విదేశీ కలుపు మొక్కల నిర్మూలన" అనే అవగాహన, నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించింది.నారాయణపేట అదనపు కలెక్టర్ శ్రీను ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. విదేశీ కలుపు మొక్కల వ్యాప్తిని గుర్తించి, అరికట్టడానికి సమన్వయ ప్రయత్నాలను ప్రోత్సహిస్తూ, ఆయన ఈ ప్రచారంలో పాల్గొన్నారు. జిల్లాస్థాయి అధికారులు, శాఖాధిపతులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఈ కార్యక్రమానికి తమ మద్దతును అందించారు. స్థానిక జీవవైవిధ్యం, నేల, వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యంపై విదేశీ కలుపు మొక్కల ప్రభావాలను ఎత్తిచూపుతూ, ఈ ప్రచారం అవగాహన, గుర్తింపు, నిర్మూలన, పర్యావరణ పునరుద్ధరణపై దృష్టి సారిస్తుంది. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంఘాలు, సంస్థలు,పౌరుల చురుకైన భాగస్వామ్యంతో తెలంగాణ వ్యాప్తంగా "థంబ్స్ డౌన్ ఉద్యమాన్ని" ముందుకు తీసుకెళ్లాలని ఈకో ఫాన్ సొసైటీ పిలుపునిచ్చింది.

## ప్రజావాణికి 58 దరఖాస్తులు

- ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి వివరాలను అర్జీదారులకు తెలియజేయాలి: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను సత్వరం పరిష్కరించి, తీసుకున్న చర్యలు, పరిష్కార వివరాలను సంబంధిత అర్జీదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవసహాయంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 58 దరఖాస్తులు అందాయి.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..** ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులకు పంపించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు అందుతున్న వినతులను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



ఫిర్యాదుల పురోగతి, పరిష్కార వివరాలను అర్జీదారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సమస్యను పరిష్కరించడం సాధ్యం కాని పక్షంలో అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ నివేదిక రూపొందించి, ఆ వివరాలను కూడా అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలను సున్నితంగా పరిగణించి నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ వినీత్



**నారాయణపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని చౌక్ బగ్జార్ సమీపంలో శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ముఖ్య అతిథిగా హాజరై గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయక మండపం నిర్వాహకులు జిల్లా ఎస్పీని ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా పెద్ద శబ్దంతో సౌండ్ సిస్టమ్స్, డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. నారాయణ పేట జిల్లా అంటేనే శాంతి భద్రతల పరిరక్షణలో నెంబర్ వన్ అనే విధంగా ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు, యువత పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీసు శాఖ సూచించిన నిబంధనలను ప్రతిఒక్కరూ పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గణేష్ మండపం నిర్వాహకులు, స్థానిక ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణి 8 ఫిర్యాదులు

- ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి 8 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

- చిన్నదర్పల్లి సమీపంలో ఘటన.. పరిస్థితి విషమం



**మహమ్మదాబాద్,సెప్టెంబర్ 21(జనంసాక్షి):** బైక్ ప్రమాదంలో టీజీఎస్పీ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం చిన్నదర్పల్లి సమీపంలో చోటు చేసుకుంది. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామానికి చెందిన గడ్డమీని రమేష్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించారు. రమేష్ 2024 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ప్రమాదానికి గల కారణాలు, గాయాల తీవ్రత, ప్రస్తుతం ఏ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారనే వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

## హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

- సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం డిమాండ్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 21(జనంసాక్షి);** ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల లబ్ధిదారులకు హైకోర్టు తీర్పు మేరకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు, లబ్ధిదారుల ప్రతినిధి కె. మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్‌కి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల పట్టణం, దౌదర్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 968, 969, 979, 980, 983, 984,



985లలో 2013లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదలకు పట్టా సర్టిఫికెట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అయితే గత ప్రభుత్వం ఆ స్థలంలో నర్సింగ్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణాల కొరకు కేటాయించడంతో బాధితులు 2022లో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన విచారణ జరిపిన హైకోర్టు, పేదలకు అనుకూలంగా తీర్పునిస్తూ మొదటి విడతగా 24-04-2026 నాటి తీర్పు (W.P. No. 28124/ 2022) ప్రకారం లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసిందని, రెండవ ఉత్తర్వు 31-07-2026 ప్రకారం మిగిలిన 648 మంది లబ్ధిదారులకు కూడా న్యాయం చేయాలని ఆదేశించిందని తెలిపారు.

హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీలను జిల్లా ఆడిసనల్ కలెక్టర్‌కి సమర్పించినట్లు తెలిపిన ఆయన జిల్లా యంత్రాంగం, అధికారులు స్పందించి హైకోర్టు ఉత్తర్వులను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## రైతులకు ఉచితంగా వేరుశెనగ విత్తనాల పంపిణీ

- పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**తెలకపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో సోమవారం రైతులకు ఉచిత వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరై రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సహాయక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా సహకార సంఘాల ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, తెలకపల్లి మండల అధ్యక్షులు బండ పర్వతాలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్తో పాటు




వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మదినం దేవాలయంలో పూజలు



**మల్దకల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలో శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి తిమ్మప్ప స్వామి సన్నిధిలో గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం అభిషేకము, అర్చనలు పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యు.చిట్టెమ్మ గోపాలు,మాజీ సర్పంచ్ నరేందర్, నాయికి మధు, ఉప్పరి నారాయణ,ముక్కెరి నాగరాజు, వడివాంబయి నరసింహులు, పరశురాముడు, తిమ్మరాజు, కృష్ణమూర్తి, చెట్టుకింది గోవిందు, వార్డ్ మెంబర్స్,బూడిది నర్సింలు, బి.తిమ్మప్ప, ఎర్నాకి మల్దకల్, రమేష్, ఎరుపుల తిమ్మప్ప, కర్రెప్ప, బజారన్న,బొస్కే రాజు,శీను, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు

## 800 మంది పోలీసులతో భద్రత.. డీజేలకు అనుమతి లేదు: ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,728 గణేష్ విగ్రహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేసినట్లు చెప్పారు.
శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే 125 మంది డీజే నిర్వాహకులు, ఆపరేటర్లను బైండోవర్ చేయడంతోపాటు అవసరమైన చోట డీజేలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా 25 మంది రౌడీషీటర్లు, 77 మంది కమ్యూనల్ షీటర్లు, మరో 54 మందిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.
జిల్లాలో సుమారు 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నారాయణపేట, ఉట్కూర్, మక్తల్, కోస్గి పట్ట ణాల్లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియో గ్రఫీతో నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిమజ్జన సమయంలో బారికేడ్లు దాట కూడదని, అనుమతి లేని ప్రాంతాల్లో నీటిలోకి దిగరాదని, చిన్నారుల ను ఒంటరిగా పంపవద్దని సూచించారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించకూడదని, మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొ నడం, వాహనాలు నడపడం చేయరాదన్నారు. సోషల్ మీడియాలో వదంతులు, రెచ్చగొట్టే లేదా వివాదాస్పద పోస్టులు చేయవద్దని హెచ్చరించారు. నారాయణపేటలో గణేష్ నిమజ్జనం, తాజీ బాబా దర్గా ఉర్సు ఒకేసారి జరుగుతున్నందున ప్రజలు పరస్పరం సహక రించి మతసామరస్యాన్ని కాపాడాలని ఎస్పీ కోరారు.

# ఘనంగా వివేకానంద విగ్రహ ఆవిష్కరణ

## యువత స్వామీజీ భావాలను పునికిపుచ్చుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి





**మక్తల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చౌరస్తాలో వివేకానంద విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన స్వామి వివేకానంద భావా లు, గుణగణాలు, శీలస్వభావాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రతుల్యమైన మనస్సు కలిగిన యువతతోనే దేశ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.
ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో తమ లక్ష్యాలను సాధించాలని, వికసిత్ భారత్-2047 లక్ష్యంగా దేశాభివృద్ధి లో భాగస్వాములు కావాలని సూచించారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకులు రాంబాబు మాట్లా డుతూ వివేకానందుని ఆశయాల స్ఫూర్తితో ఏబీవీపీ ఏర్పడిందని, విద్యా, సామాజిక సమ స్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. విగ్రహ ఆవిష్కరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహు మతులు అందజేశారు. అనంతరం స్వామీజీ లు, మంత్రి వాకిటి శ్రీహరిని విగ్రహ ప్రతి ష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అంజి రెడ్డి, వినయ్‌కుమార్, వంశీ, వినయ్, శరణ్, సందీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గోమాతకు దంపతులచే మహాపూజ





**జహీరాబాద్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** జహీరాబాద్ పట్టణంలోని చెన్నారెడ్డినగర్ కాలనీలో గోమాతకు 21 మంది దంప తులు మహాపూజ, కుంకుమార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ గణేష్ ఉత్సవ సమితి, రాయల్ గ్రీన్ సిటీ సమన్వయ సమితి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రో చ్చరణల మధ్య కార్యక్రమం జరిగింది. గత ఐదేళ్లుగా కాలనీలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నవరాత్రుల సందర్భంగా ప్రత్యే క పూజలు, అభిషేకాలు, గీతా పారా యణం, హనుమాన్ చాలీసా, భజనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని వినాయకుడు, గోమాతను దర్శిం చుకున్నారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదం పంపిణీ చేశారు.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

- **అక్టోబర్ 4న నిర్వహణ కమిటీ ఎన్నికలు.. 24న నామినేషన్ల స్వీకరణ**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వ హించనున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివప్రసాద్ సోమవారం వెల్లడించారు.
సంగారెడ్డి జిల్లా శాఖ సభ్యుల జాబితాను ఇప్పటికే ప్రచురించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తారు. 25న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ జరుగుతుంది. 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించి, ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు. అవసరమైన పక్షంలో అక్టోబర్ 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్, సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటించి, అనంతరం కార్యవర్గ పదాధికారుల ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.
నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.10 వేల తిరిగి చెల్లించని రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా లేదా రాతపూర్వక అభ్యర్థనతో అధీకృత వ్యక్తి ద్వారా సెప్టెంబర్ 24న పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9949992039 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల రోజున ఓటు వేసేందుకు వచ్చే సభ్యులు సొసైటీ జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డుతో పాటు మరో చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు ఆధారాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల అధికారి శివప్రసాద్ తెలిపారు.

# క్రీడల్లో రాణించి రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులకు డీఎస్పీ ప్రసన్న కుమార్ సూచన






**మెదక్ టౌన్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్ జీ ఫ్) ఆధ్వర్యంలో మెదక్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఈ పోటీలకు మెదక్ డీఎస్పీ శ్రీ ప్రసన్న కుమార్ హాజరై క్రీడాకారు లను పరిచయం చేసుకున్నారు.
ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని గుర్తు చేశారు. విద్యార్థులు క్రీడల్లో చక్కగా రాణించి, ఈ రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని బాలబాలికలకు ఆకాంక్షించారు.
విజయం సాధించడం ఎంత ముఖ్యమో, ఓటమిని సైతం సానుకూలంగా స్వీకరించి మరింత పట్టుదలతో ముందుకు సాగడం కూడా అంతే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకోవాలని సూచించారు.
"గెలుపు ఒక్కటే లక్ష్యం కాకుండా.. మంచి క్రీడాకారులుగా ఎదగడం, క్రమశిక్షణతో ముందుకు సాగడం, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలి" అని డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు.

**విజేతలు**

**బాలుర విభాగం:**

1. కౌడిపల్లి మండలం - ప్రథమ స్థానం
2. శంకరంపేట (ఏ) మండలం - ద్వితీయ స్థానం
3. వెల్దుర్తి మండలం - తృతీయ స్థానం

**బాలికల విభాగం:**

1. అల్లాదుర్గ్ మండలం - ప్రథమ స్థానం
2. వెల్దుర్తి మండలం - ద్వితీయ స్థానం
3. శివంపేట మండలం - తృతీయ స్థానం

ఈ కార్యక్రమంలో పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు, పీఈటీ/పీఈడీ సంఘం తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, మధుసూదన్‌తో పాటు పీడీలు శ్రీధర్ రెడ్డి, మాధవ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ఎస్. నరేష్ కుమార్, ప్రభాకర్, రవి, శ్యామ్, రూపేందర్, ప్రతిభ, విజయ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్. నాగరాజు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు.

# సామాజిక పితామహుడుకొండ లక్ష్మణ్ బాపూజీ

- **మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్: రాజా రామ్ ప్రకాష్**




**బిజినేపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** సామాజిక పితామహుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అని మహనీయుల వేదిక రాష్ట్ర చైర్మన్ రాజా రామ్ ప్రకాష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గంగా రం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమర యోధుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మొదటిసారి రాజీనామా చేసిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు నిజాం ప్రభుత్వంపై పోరాటం చేసిన పోరాట యోధుడు ప్రముఖ న్యాయవాది, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ఊపిరి పోసి వలసాంధ్ర దోపిడీని గుర్తించి ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అంటూ లేవదీసిన ఉద్యమ తేజంఅని కొనియాడారు. పోరాటానికి పట్టుదలకు అంకితభావానికి నిలువుటద్దంగా నిలిచి తెలంగాణ కు కొండంత అండగా ఎదిగిన స్వాతంత్ర సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కీలక పదవులను వదిలేసిన నిజాయితీకి నిరాడంబరత కు మారుపేరుగా నిలిచి బడుగుల బాంధవుడిగా పేరు తెచ్చుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రతి అడుగు ఉద్యమమేసీమాంధ్ర వలస వాదుల మోసాలపై సమరం చేసిన యోధుడు రాష్ట్ర ఆకాంక్షల ముందు మంత్రి పదవిని గడ్డిపోచతో సమానమని చెప్పడమే కాకుండా అందు కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రి అని తెలంగాణ రాష్ట్రం వచ్చే వరకు తాను ఎలాంటి పదవులను చేపట్టనని ప్రతిజ్ఞ చేసిన ప్రతిభాశాలి ఆయనఅని అన్నారు. వృద్ధాప్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావాలని ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర పది రోజుల పాటు దీక్ష చేసి కేంద్ర ప్రభుత్వానికి కదిలించిన యోధుడు అని అన్నారు.తెలంగాణలో సామాజిక తెలంగాణ రాష్ట్రం కావాలని దళిత బహుజన వర్గాలను చైతన్యం చేసి పోరాటానికి సిద్ధం చేసినటువంటి పోరాట యోధుడు బడుగుల బాంధవుడు సామాజిక పితామహుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణారెడ్డి, రత్న శేఖర్, రాజప్ప, మహమ్మద్, అశోక్‌కుమార్,కోములయ్య, శ్రీకాంత్ రెడ్డి, నందకిషోర్, నితీష్ కుమార్ పాల్గొన్నారు.